విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల
వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను

Cell: 9247819181
8309605189



TEL TEL 12230

# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA





హైదరాబాద్,కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల,వరంగల్,జగిత్యాల సోమవారం 30 జూన్ 2025 పేజీలు : 5 వెల : 2.00


## స్థానిక సంస్థల ఎన్నికలవైపు

# యువత దృష్టి




తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ శాతం మంది యువకులు బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజల మద్దతు కోసం యువత గ్రామాల్లో హల్‌చల్ చేస్తున్నారు. వారి దూకుడుతో గ్రామాల్లోని పార్టీ సీనియర్ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్ని కలు జరుగుతాయన్న యోచనలో ఉండడంతో పార్టీ టిక్కెట్ కోసం ఇప్పటి నుంచే విశ్వ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఒకవేళ టిక్కెట్ దక్కకపోతే సర్పంచ్ స్థానానికైనా పార్టీ మద్దతు కోసం బడా నాయకుల దృష్టిలో పడేందుకు ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. స్వాతంత్ర్య అభ్యర్థిగానైనా పోటీలో ఉండేందుకు సిద్ధమవుతున్నారు. అభ్యర్థులకు రిజర్వేషన్‌ల టెన్షన్..స్థానిక సంస్థల ఎన్నికలపై రిజర్వేషన్ టేన్షన్ మొదలైంది. గత బీఆర్ఎస్ పాలనలో పదేళ్ల పాటు ఇవే రిజర్వేషన్‌లు కొనసాగుతాయని చెప్పడంతో అశావాహులు ఆయా రిజర్వేషన్‌ల ప్రకారం అభ్యర్థులు ఆయా పార్టీల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు చేశారు. కానీ, ఇటీవ ల కాంగ్రెస్ ప్రభుత్వం స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రకటించడంతో ప్రస్తుతం ఉ న్న రిజర్వేషన్‌లలో మార్పులు వచ్చే అవకాశాలు ఉన్నాయంటూ రాజకీయనిపుణులు భావిస్తున్నారు. దీంతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌ల స్థానాలలో పోటీ లో నిలిచే అభ్యర్థులకు రిజర్వేషన్‌ల టేన్షన్ మొద లైంది. వీటిలోనూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఉండడంతో ఏ స్థానానికి ఏ రిజర్వేషన్ వస్తుందో, తమకు అనుకూలంగా వస్తుందా లేదా అన్న ఆందోళనలో అభ్యర్థులు ఉన్నారు.

# జర్నలిస్ట్ స్వేచ్ఛకు కన్నీటి వీడ్కోలు...



జర్నలిస్ట్ స్వేచ్ఛ అంత్యక్రియలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య ముగిశాయి. శుక్రవారం జవహర్‌నగర్‌లోని తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఆమెకు అంబర్‌నగర్‌లోని శ్మశానవాటికలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ముషీరాబాద్‌లోని స్వేచ్ఛ తల్లిదండ్రుల ఇంటి నుంచి శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర సాగింది. స్వేచ్ఛ తల్లిదండ్రులు శ్రీదేవి, శంకర్, ఆమె కూతురు రోదనలు మిన్నంటాయి. శ్మశానవాటికకు చేరుకున్న బీఆర్ఎస్, జర్నలిస్ట్ సంఘాల నేతలు, స్నేహితులు, ఆత్మీయులు స్వేచ్ఛ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం స్వేచ్ఛకు కన్నీటి వీడ్కోలు పలికారు. అంతకుముందు గాంధీ దవాఖానలో స్వేచ్ఛ భౌతికకాయానికి వైద్యులు పోస్ట్‌మార్టం నిర్వహించారు. తీరని దుఃఖంలోనూ స్వేచ్ఛ తల్లిదండ్రులు ఆమె కండ్లు దానం చేసి, ఆదర్శంగా నిలిచారు.గాంధీ మార్చురీకి వచ్చిన పలువురు జర్నలిస్టు సంఘాల నేతలు మీడియాతో మాట్లాడుతూ స్వేచ్ఛ మరణం తమకు ఎంతో దిగ్భ్రాంతి కలిగించిందని ఆవేదన వ్యక్తంచేశారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేశ్, వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, సీనియర్ ఎడిటర్ కే శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) అధ్యక్షుడు విరాహత్ అలీ, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, సీనియర్ జర్నలిస్టులు శైలేశ్‌రెడ్డి, మారురీసాగర్, పల్లె రవికుమార్, రమణ, టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రా ఆనంద్, అరుణోదయ ప్రజాగాయని విమలక్క, పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య, పలువురు జర్నలిస్టులు వారిలో ఉన్నారు.


మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA
epaper
చదవడానికా QR కోడ్‌ను
స్కాన్ చేయండి
http://manavaartha.net
MANA VAARTHA


## దేశవ్యాప్తంగా తీవ్రచర్చనీయాంశంగా

# రైల్వే బ్రిడ్జి



మధ్యప్రదేశ్‌లో నిర్మించిన ఓ రైల్వే బ్రిడ్జి దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే ఆ బ్రిడ్జ్ నిర్మాణం సాధారణ రైల్వే బ్రిడ్జ్‌ల నిర్మాణానికి భిన్నంగా 90 డిగ్రీల మలుపుతో నిర్మించడమే.ఈ బ్రిడ్జిని ఎల్ ఆకారంలో నిర్మించడంతో ప్రారంభానికి ముందే దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో తెగవైరల్ అయ్యాయి. దీంతో ఈ బ్రిడ్జ్ నిర్మాణంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలో అధికారులు బ్రిడ్జ్ ప్రారంభోత్సవాన్ని నిలిపివేశారు.కాగా ఇక బ్రిడ్జ్ నిర్మాణ విషయం ప్రభుత్వం దృష్టికి చేరడంతో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు అధికారులపై ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బ్రిడ్జ్ నిర్మాణంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని భావించిన ప్రభుత్వం తాజాగా బ్రిడ్జి నిర్మాణం కోసం పనిచేసిన ఏడుగురు ఇంజినీర్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరో విశ్రాంత చీఫ్ ఇంజినీర్‌పై శాఖాపరమైన విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.ఇక వ్యవహారంపై స్వయంగా సీఎం మోహన్ యాదవ్ స్పందిస్తూ..బ్రిడ్జ్ నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు బ్రిడ్జ్ నిర్మాణంపై విచారణకు కూడా ఆదేశించినట్టు తెలిపారు. అంతే కాకుండా బ్రిడ్జ్ నిర్మాణ ఏజెన్సీ, డిజైన్ రూపొందించిన కన్సల్టెంట్‌లను బ్లాక్‌లిస్టులో ఉంచినట్టు ఆయన తెలిపారు. ఈ బ్రిడ్జిని పునరుద్దరించేందుకు మరో కమిటీ ఏర్పాటు చేసినట్టు కూడా ఆయన తెలిపారు.

# జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట

## పలు అధికారులపై బదిలీ వేటు




ఒడిశాలోని పూరీలోని శ్రీ గుండిచా ఆలయం సమీపంలో జగన్నాథ రథయాత్ర సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు మృతిచెందగా, 50 మంది గాయపడ్డారు. ఆదివారం తెల్లవారుజామున -4.30 గంటల ప్రాంతంలో భారీ జనసమూహం మధ్య ఈ సంఘటన జరిగింది. శ్రీ గుండిచా ఆలయం సమీపంలో దర్శనం కోసం వందలాది మంది భక్తులు అకస్మాత్తుగా ముందుకు సాగడంతో తొక్కిసలాట జరిగింది. మృతులు ఖుర్దా జిల్లాకు చెందిన ప్రతివా దాస్ ఫిమేల్ (52), ప్రేమకాంత మొహంతి (78),బసంతి సాహు (42) గా గుర్తించారు. వారి మృతదేహాలను పోస్టుమార్టం కోసం పంపారు. గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నారు. వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటనకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. రద్దీకి కారణం,భక్తుల సమూహం నియంత్రణలో లోపాలపై దర్యాప్తు సాగుతోంది.

## ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా గగనతల దాడి



ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్ కమ్యూనికేషన్ కమాండర్ యూరీ ఇహ్నాట్ మాట్లాడుతూ గత రాత్రి అతిపెద్ద దాడి జరిగిందని వెల్లడించారు. ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని రష్యా ఆయుధాలను ప్రయోగించినట్లు చెప్పారు. పోలాండ్ గగనతల రక్షణ కోసం మిత్రదేశాల యుద్ధ విమానాలు రంగంలోకి దిగినట్లు పేర్కొన్నారు. ఖెర్సాన్ ప్రావిన్స్‌లో జరిగిన దాడుల్లో ఒకరు మరణించినట్లు అక్కడి గవర్నర్ వెల్లడించారు. ఈ దాడిలో ఉక్రెయిన్‌కు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానం కూలిపోయి. అందులోని పైలట్ ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి మిలిటరీ తెలిపింది. ఇప్పటి వరకూ ఈ యుద్ధంలో మూడు ఎఫ్-16లను రష్యా కూల్చివేసింది. ఇక ఉక్రెయిన్ తీరప్రాంత నగరమైన ఒడెసాలోని ఓ అపార్ట్‌మెంటుపై రష్యా శుక్రవారం రాత్రి చేసిన డ్రోన్ దాడిలో భార్యాభర్తలు మరణించారు. ఈ దాడిలో 17 మంది తీవ్రంగా గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. అపార్ట్‌మెంట్‌లోని మూడు అంతస్తులు దెబ్బతిన్నాయి. మరోవైపు పశ్చిమ రష్యా, క్రిమియాపై ఉక్రెయిన్ ప్రయోగించిన 40 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది.రష్యాలో వేర్పాటువాదాన్ని పశ్చిమ దేశాలు ప్రోత్సహిస్తున్నాయని, ఉక్రెయిన్‌తో చేస్తున్న యుద్ధంలో జోక్యం చేసుకుంటున్నాయని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆరోపించారు. బెలారస్ రాజధాని మిన్స్క్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. "రష్యాకు వ్యతిరేకంగా ఇస్లామిక్ స్టేట్ పనిచేస్తున్నంత కాలం ఎవరూ దానిపై దృష్టి సారించరు. మాస్కోలో పేలుళ్లు నేటికీ జరుగుతున్నాయి. మా దేశంలో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించి, మాపై పోరాటానికి ఉగ్రవాదాన్ని సాధనంగా ఎంచుకున్న పశ్చిమదేశాల విషయంలో కూడా ఇదే జరిగింది. నాటో విస్తరణ, ఉక్రెయిన్‌తో వివాదాన్ని పరిష్కరించడం లాంటి వాగ్దానాలు ఇచ్చి వాటిని నిలబెట్టుకోకుండా పశ్చిమ దేశాలు రష్యాను పదేపదే మోసం చేస్తున్నాయి" అని పుతిన్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్



**కొడిమ్యాల:జూన్ 29 మన వార్త ప్రతినిధి శ్రీనివాస్**
కొడిమ్యాల మండలంలోని నమిలికొండ గ్రామానికి చెందిన చెలిమల మహేందర్ మృతి చెందగా ఆదివారం రోజున చొప్పదండి తాజా మాజీ శాసనసభ్యులు సుంకే రవిశంకర్ మృతుని కుటుంబీకులకు ఐదు వెయ్యిల రూపాయలను దహన సంస్కారాల నిమిత్తంఅందజేశారు.. పునుగోటి కృష్ణారావు రెండు వెయ్యిల రూపాయలను మృతుని కుటుంబీకులకు అందజేశారు..తాజా మాజీ మల్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ కోరండ్ల నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు శివ ప్రసాద్ రెడ్డి,అనిత నరేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## జులై 2న బుద్ధుడి జీవిత చరిత్రపై నాటక ప్రదర్శన



**జహీరాబాద్, జూన్ 29 (మన వార్త):** జులై 2 న జహీరాబాద్ పట్టణంలో తథాగత గౌతమ బుద్దుడి జీవిత చరిత్ర పై నాటక ప్రదర్శన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారిచే బుద్ధునితో నా ప్రయాణం అనే నినాదం తో ప్రదర్శించ బడుతుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రపంచ శాంతి దూత సిద్ధార్థ గౌతమ బుద్ధుడు సమస్త మానవ జాతి ఎదుర్కొంటున్న దుఃఖానికి మూలకారణాన్ని అన్వేషిస్తూ, దుఃఖ విముక్తికి మార్గం తెలుసుకుంటూ ప్రపంచం తిరిగడాన్నారు. కఠోర ధ్యాన సాధన చేస్తూ, దుఃఖ విముక్తికి మార్గం కనుక్కొని మానవ జాతికి బోధించాడని సూచించారు. అలాంటి మహోన్నత వ్యక్తి జీవిత చరిత్ర నాటక ప్రదర్శన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణం షెట్కార్ ఫంక్షన్ హాల్లో జులై 2 బుధవారం సాయంత్రం 6 గంటల 30 నిమిషాలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇట్టి ప్రదర్శనను తిలకించడానికి కుల మతాలకతీతంగా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జీవిత సత్యం పై అవగాహన పెంచుకోవాలని కోరారు.

## పిట్టలగూడెం గ్రామస్తులకు విద్యుత్ మీటర్లను అందజేసిన ప్రభుత్వ విప్



**-ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య..**

**యాదాద్రి భువనగిరి జిల్లా జూన్ / 29 / మన వార్త జిల్లా ప్రతినిధి**
యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం పిట్టలగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యెల్లెంల సంజీవరెడ్డి తన సొంత నిధులతో గ్రామంలోని పలు నిరుపేద కుటుంబాలకు ఇంటి విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి మిటర్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ , ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య చేతుల మీదుగా ఆదివారం రోజు ఆయా కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా పిట్టలగూడెం గ్రామస్తులు సాయంత్రం చీకటి పడితే తాము పడుతున్న కష్టాలను గుర్తించిన ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఆయిలయ్య కుటుంబం చల్లగా ఉండాలని ఆయనకు వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటకొండూర్ మండల ప్రజా ప్రతినిధులు , అధికారులు , మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత...



**- అనుమతులు లేకుండా తరలించేవారిపై పోలీస్ నిఘా..**

**దేవరకద్ర ప్రతినిధి,జూన్29(మన వార్త జి.రవికుమార్)**
ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌ను అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా మదనాపురం మండలం గోపాన్ పేట గ్రామం శివారులో అక్రమంగా తరలిస్తున్న ఇసుకను రాత్రి పోలీసులు నిఘా పెట్టి రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు.దొంగతనంగా కర్వేన గ్రామం ఊక చెట్టు వాగు లో ఎటువంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నందున రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని,అక్రమంగా తరలించేవారిపై నిఘా పెట్టామని హెచ్చరించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం




**దేవరకద్ర ప్రతినిధి,జూన్29(మన వార్త జి.రవికుమార్)**
వనపర్తి జిల్లా మదనాపురం మండలం నెల్విడి గ్రామం కాంగ్రెస్ నాయకులు దేశి నరసింహ యాదవ్ సతీమణి దేశి మంజుల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి భౌతిక దేహానికి నివాళులర్పించి,కుటుంబ సభ్యులను పరామర్శించి 15వేలు రూపాయలు ఆర్థిక సాయం చేసిన మదనాపురం మండల కాంగ్రెస్ నాయకులు మరియు గ్రామ కాంగ్రెస్ నాయకులు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలోని బీసీ సాధికారిత సంఘం కార్యాలయంలో బీసీ ముఖ్యనేతల సమావేశం

# జిల్లా అధ్యక్షులు పొలాస నరేందర్ ఆధ్వర్యంలో జరిగింది



**వేములవాడ , జూన్ 29 (మన వార్త ప్రతినిధి నందు రావు)**
పంచాయతీ ఎన్నికలు సెప్టెంబర్ 30 లోపున జరుపాలని,30 రోజుల్లో రిజర్వేషన్లను ఖరారు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈనెల 25 న ఆదేశించినందున,రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి మార్చి 17 న అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్ ద్వార కేంద్రానికి పంపిన 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లులు తప్పని సరిగా కేంద్ర ఆమోదం పొందాల్సిన అవసరం ఉన్నందున ,సిఎం ఢిల్లీలో అఖిలపక్షంతో మఖాం పెట్టాలని ఆదివారం రోజు వేములవాడ బీసీ సాధికారిత సంఘం కార్యాలయంలో జరిగిన ముఖ్య బీసీ నేతల సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు పొలాస నరేందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నీ కోరారు. కేంద్రానికి పంపిన బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోధంకై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాట ప్రకారం మాట తప్పకుండా ,మడమ తిప్పకుండా,అఖిలపక్షాన్ని డిల్లీకి తీసుకువెళ్ళి,ప్రధానిపై ఒత్తిడి తెచ్చి బీసీ బిల్లుల ఆమోదం పొందేలా కృషి చేసి,చట్టబద్ధంగా,శాస్త్రీయంగా 42 శాతం బీసీ రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించాలని సి ఎం ని నరేందర్ కోరారు.జూలై 21 నుండి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఉ ండడం,జూలై 24 వరకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని హైకోర్టు ఆదేశించడంతో,రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చించి రాజ్యాంగపరంగా,న్యాయపరంగా చిక్కులు ఉత్పన్నం కాకుండా 42 శాతం బీసీ రిజర్వేషన్లతో ఎన్నికలు జరపాలని సి ఎం కి నరేందర్ విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుండి ఏదో విధంగా బడుగు,బలహీన వర్గాలు మోసపోతున్నారని,ఇంకా మోసపోవడానికి సిద్ధంగా లేరని,బీసీ రిజర్వేషన్ అమల్లో తేడా వస్తే,తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలాగ ,మరో బీసీ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి పడుతుందని,1995 లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ అమల్లో కోర్టు అభ్యంతరంతో 6 మాసాలు ఎన్నికైన సర్పంచులకు అధికారాలు అప్పగించలేదన్న విషయాన్ని గుర్తు చేస్తూ,అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా,బీసీలకు అన్యాయం జరుగకుండా చట్టబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వానికి నరేందర్ విజ్ఞప్తి చేశారు.సమావేశంలో పట్టణ బీసీ సాధికారిత సంఘం ప్రధాన కార్యదర్శి ఇల్లందుల వెంకటేశం,జిల్లా బీసీ నేతలు అంబాటి సంతోష్ యాదవ్,సీహెచ్.రామస్వామి గౌడ్,ఆన్నారపు ఇస్తారి, ఎట్టెం సాయి కృష్ణ,కుంభం రవి,ఉయ్యాల భూమయ్య గౌడ్,ముద్రకొల లింబద్రి,ముద్రకోల గణేష్,అబ్బనవేని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహాన్యూస్ కార్యాలయం పై బిఆర్ఎస్ చేసిన దాడిని తీవ్రంగా ఖండించిన తెలుగుదేశం

# పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రామన్ గౌడ్




**పెబ్బేరు.జూన్ 29(మన వార్త ప్రతినిధి శివరాజు)**
మీడియాపై దాడులు ప్రజాస్వామ్యానికి విఘాతం తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రామన్ గౌడ్ అన్నారు.పోలీసులు ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.ఫోన్ ట్యాపింగ్ అంశం అన్నది తెలంగాణంలో గత కొంతకాలంగా నడుస్తోందన్నారు.దీనిపై మీడియా ప్రతినిధులు తమకు అందిన సమాచారం మేరకు వార్తలు ప్రసారం చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా మహాన్యూస్ ఛానల్ ప్రసారం చేసిన అంశాలు మీకు ఇబ్బంది కల్గించి ఉంటే వాటిని మరో రూపంలో ఖండించాల్సిందన్నారు,లేదా చట్టపరంగా ముందుకెళ్లవచ్చన్నారు. కానీ అవన్నీ మానేసి ప్రజాస్వామ్యంలో ?ఒక రాజకీయ పార్టీగా ఉంటూ బాధ్యత మరిచి ప్రవర్తించడం సరికాదన్నారు. ఈ దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. పత్రికా రంగంపై, మీడియా పై దాడులు సరికాదు తెలుగు మీడియా ఛానల్ మహా టీవీ ప్రధాన కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రజాస్వామ్య దేశంలో భౌతిక దాడులు సరికాదు. మీడియాపై దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా పరిగణించాలి. కథనాలపై అభ్యంతరాలుంటే ఖండించాలి కానీ.. దాడులు చేయడాన్ని ప్రజలు, సమాజం హర్షించదు దాడికి పాల్పడిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. మహా టీవీ యాజమాన్యానికి, సిబ్బందికి సంఘీభావం తెలుపుతున్నామని రామన్ గౌడ్ తెలిపారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తాం



**నార్సింగి జూన్ 29 (మన వార్త ప్రతినిధి నరేందర్)**
పేదోడి స్వంత ఇంటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని, అందుకే ఇచ్చిన హామీ ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతోందని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ యెన్నం రాజేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ యెన్నం రాజేందర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా తొలి దశలో 312 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని, అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ఇంటి నిర్మాణం చేపట్టడమే ప్రభత్వ లక్ష్మమని పేర్కొన్నారు. తొలి దశలో వితంతు, పేద మహిళలకు ప్రాధాన్యం ఇచ్చారని, ఎలాంటి అవకతవకలు జరగకుండా డబ్బులు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని అన్నారు. మండలంలో కొందరు వసూళ్ళకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, నాయకులు, అధికారులు ఎవరైనా లబ్ధిదారుల నుంచి ఇందిరమ్మ ఇండ్ల పేరుతో డబ్బుల వసూళ్ళకు పాల్పడితే సహించేది లేదని ఆయన అన్నారు. ప్రభుత్వం మంచి సత్సంకల్పం తో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నడిపిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పక్కదారి పట్టించే వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొలి దశలో ఇండ్లు మంజూరు కాని వారు అధైర్య పడవద్దని, అర్హులైన ప్రతీ ఒక్కరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఖచ్చితంగా ఇస్తుందని హామీ ఇచ్చారు.

# మైనార్టీలను వేదిస్తున్న కేంద్ర ప్రభుత్వం...




**- ఆవాజ్ మూడవ మహాసభలను విజయవంతం చేయాలి...**

**- ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి జబ్బార్...**

**దేవరకద్ర ప్రతినిధి,జూన్29(మన వార్త జి.రవికుమార్)**
మైనార్టీలను కేంద్ర బిజేపి ప్రభుత్వం వేధిస్తోందని ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి జబ్బార్ అన్నారు.వనపర్తి జిల్లా మదనాపురం మండల కేంద్రంలో ముస్లిం మైనార్టీల సోదరులతో సమావేశమై మాట్లాడారు.మైనార్టీల పేదరికం నిరక్షరాస్యత,నిరుద్యోగం వెనకబాటు తనం వంటి సమస్యలతో పాటు లౌకిక,ప్రజాస్వామ్య పరిరక్షణ రాజ్యాంగ హక్కుల సాధన కోసం ఆవాజ్ విశాల ప్రాతిపదికన పనిచేస్తుందన్నారు.370 ఆర్టికల్ రద్దు,సిఏఏ,వక్ఫ్ సవరణ చట్టం, త్రిపుల్ తలాక్ క్రిమినలైజేషన్ వంటి చట్టాలు మైనార్టీలను వేదించడం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు.బిజేపి పాలిట రాష్ట్రాల్లో మైనారిటీలపై విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయన్నారు.గో రక్షణ పేరుతో మూక దాడులు చేసి 150 మందిని హత్య చేశారన్నారు.బుల్డోజర్లతో ఇండ్ల కూల్చివేత యదేచ్ఛగా సాగుతుందన్నారు.మతోన్మాద విష సంస్కృతి క్రమంగా తెలంగాణ రాష్ట్రంలో విస్తరిస్తుందన్నారు.విద్వేష విష బీజాలు ప్రజల మధ్యలో నాటి కలిసి మెలిసి బ్రతుకుతున్న ప్రజల మధ్య విభజన గీతలు గీస్తుందన్నారు. ఈ నేపథ్యంలో మైనార్టీల వాస్తవ జీవిత పరిస్థితులను తెలంగాణ ప్రజలకు వివరించి జరుగుతున్న అసత్య,విద్వేష ప్రచారాలను ఎండగడుతూ ప్రజలలో చైతన్యం కలిగించాలని ముస్లిం మైనార్టీ సోదరులకు వెల్లడించారు.జూలై నెలలో 13వ తేదీన గద్వాల జిల్లాల్లో జరిగే తృతీయ మహాసభలకు మైనార్టీలందరూ తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు మహ్మద్ ఖాసీం,మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి అంజద్ అలీ,జిల్లా కార్యదర్శి ఎండి ఖాజామైనద్దిన్,నజీర్,మక్బుల్,చాంద్ పాషా, ఖాజారామ్,సిపిఎం మండల కార్యదర్శి వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

# పేలిన ట్రాన్స్ఫార్మర్ తప్పిన ప్రమాదం



**చిన్నశంకరంపేట జూన్ 29: (మన వార్త ప్రతినిధి నరేందర్)**
చిన్న శంకరంపేట మండలంలోని దరిపల్లి గ్రామంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ భారీ శబ్దంతో పేలింది. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. దశాబ్దాల క్రితం ఏర్పాటుచేసిన విద్యుత్ తీగలు చెట్ల కొమ్మలకు తగలడంతో ట్రాన్స్ఫార్మర్ పేలి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పేలిన సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి వెంటనే ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరా చేయాలని ప్రజల కోరారు.

# నిరుపయోగంగా డంపింగ్ యార్డు..



**నార్సింగి జూన్ 29 (మన వార్త ప్రతినిధి నరేందర్)**
ఇటీవల పంచాయతీ కార్యదర్శులు ఆర్థిక పరమైన విధుల నిర్వహణ తమ వల్ల కావడం లేదని వాటిని బహిష్కరిస్తున్నట్లు పేర్కొంటూ ట్రాక్టర్ల తాళం చేతులు ఎంపిడిఓ కు అందజేశారు.అప్పటి వరకు ప్రతి రోజూ లేదా రోజు తప్పించి రోజు తమ ఇళ్ల దగ్గరకు వచ్చి చెత్త సేకరణ చేసే ట్రాక్టర్ రావడం లేదని ఆయా గ్రామాల వారు వాపోతున్నారు.వానాకాలం కావడం చెత్త నిలువ ఉండడం తో రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వివిధ గ్రామాలలో చెత్త సేకరణ నిలిచిపోగా వ్యవస్థ పునరుద్ధరణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ఇంటింటి నుంచి చెత్త సేకరణ జరిపి ట్రాక్టర్ ద్వారా చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తీసుకువెళ్లి తడి పొడి చెత్తను వేరు చేయడంతో పాటు కంపోస్టు ఎరువు తయారీకి రూపకల్పన చేసి అమలు చేసి మంచి ఫలితాలను రాబట్టింది.గ్రామాల్లో సేకరించిన తడి,పొడి చెత్తను వేరు చేస్తారు.తడి చెత్తను డీ కంపోస్టు చేయడంతో రెండు రోజుల్లో పూర్తిగా కుళ్లిపోతుంది. దీనిని సెగ్రిగేషన్ షెడ్డులో ఉన్న బెడ్‌పై వేయడంతో అప్పటికే బెడ్‌లో ఉన్న వాన పాములు చెత్తను సేంద్రీయ ఎరువులుగా మారుస్తాయి. సేంద్రీయ ఎరువుల తయారీకి ఉపయోగపడే వాన పాములకు పోషకాలను కూడా అందిస్తారు. వానపాములు తడి చెత్తను పూర్తిగా సేంద్రీయ ఎరువుగా మారుస్తాయి. ఇలా వారంలో దాదాపు ఒకటి నుంచి 2 క్వింటాళ్ల సేంద్రీయ ఎరువు తయారువుతుంది.తయారు చేసిన సేంద్రీయ ఎరువులను 20,50 కిలోల బస్తాల్లో విక్రయిస్తారు.కానీ సెగ్రిగేషన్ షెడ్లను అధికారులు పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సెగ్రిగేషన్ షెడ్లను ఉపయోగంలోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.

## మాన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన బిజెపి నాయకులు



**శంకరపట్నం: జూన్ 29(మనవార్త ప్రతినిధి నేరెళ్ల సంతోష్)**
శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 123వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి బీజేపి నాయకులతో కలిసి వీక్షించారు. దేశ సమైక్యత, యోగ,క్రీడలు,నాసా వంటి అంశములపై ప్రధాని దేశ ప్రజలకు సందేశం ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాసమల్ల శ్రీనివాస్,సుదగోని శ్రీనివాస్, పడాల వెంకటలక్ష్మి,బొజ్జ సాయి ప్రకాష్,బిట్టు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కార్డెన్ సర్చ్



**జైనూర్ జూన్ 29 ( మన వార్త )** ప్రతినిధి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోచం లొద్ది గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించబడింది గ్రామంలో నేరాల నివారణ, మత్తు పదార్థాలపై అవగాహన, ట్రాఫిక్ నియమాల పాటించడం, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు, గ్రామంలో కొత్త వ్యక్తుల గుర్తింపు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీస్ శాఖ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ భద్రతా పరిరక్షణకు కృషి చేస్తుందనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లోని 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడం, మరియు గ్రామంలోకి కొత్తగా వచ్చిన నల్గురు వ్యక్తులను విచారించి పంపడం జరిగింది. గ్రామంలోకి కొత్త వ్యక్తులు వచ్చినట్లయితే వెంటనే సమాచారం అందించాలని, మరియు అసాంఘిక కార్యక్రమాలు చేసే వ్యక్తులకు ఆశ్రయం కల్పించడం, ఎలాంటి సహాయ సహకారాలు అందించకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో సీఐ ఎ.రమేష్, జి.రవికుమార్ (ఎస్సై జైనూర్), సీ ఎచ్.గంగన్న (ఎస్సై లింగాపూర్), ఎస్సై బోజ్జిరావు, పోలీస్ సిబ్బంది మరియు 30 మంది పాల్గొన్నారు.

# జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఇల్లంతకుంట మహిళా కమిటీ నియామకం



**-మహిళా మండల అధ్యక్షురాలు తీగల పుష్పలత,ప్రధాన కార్యదర్శి ముత్యం భాగ్యలక్ష్మి...**

**ఇల్లంతకుంట జూన్ 29 (మన వార్త ప్రతినిధి):**
జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్లా జిల్లా ఇల్లంతకుంట మండల మహిళా మహిళా అధ్యక్షురాలుగా ఆనంతారం గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యురాలు తీగల పుష్పలత,మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా ముత్యం భాగ్యలక్ష్మి కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు మ్యాకల పర్శరాములు ఆదివారం రోజున నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పర్శరాములు మాట్లాడుతూ విద్య, ఉద్యోగాల్లో, రాజకీయాల్లో బీసీ లకు రాజ్యాంగభద్ధమైన హక్కులకోసం బీసీ మహిళలే కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఇల్లంతకుంట మండల అధ్యక్షులు గుంటి మహేష్,ప్రధాన కార్యదర్శి బత్తిని స్వామి గౌడ్,జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగారం కొమురవ్వ,సోషల్ మీడియా వారియర్స్ గడ్డం నరేష్,ఎల్లారెడ్డి పేట మండల అధ్యక్షురాలు బాధ పోచవ్వ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

# వేములవాడ రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



**వేములవాడ జూన్ 29 ( మన వార్త ప్రతినిధి )**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ధర్మగుండంలో స్నానాలు ఆచరించిన తర్వాత కోడె మొక్కులతో పాటు ఇతర మొక్కులు తీర్చుకున్నారు. పరివార దేవతలను సైతం దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తలనీలాలు సమర్పించుకొని సేవలో తరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రాధాబాయ్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

## వేములవాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ బద్ది పోచమ్మ తల్లికి బోనాలు సమర్పణ



**వేములవాడ జూన్ 29 ( మన వార్త ప్రతినిధి )** వేములవాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ బద్ది పోచమ్మ తల్లి కి బోనాలు సమర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సిద్ధం శెట్టివేణుమాట్లాడుతూవేములవాడ పట్టణ ఆర్యవైశ్యులు, ప్రజలందరూ క్షేమంగా, ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతోఉండాలనికోరుకున్నారు అలాగే వేములవాడ చుట్టూ ఉన్నగ్రామదేవతలకుకొబ్బరికాయలు కొట్టి అనంతరం శ్రీ బద్ది పోచమ్మ తల్లికి వేములవాడ పట్టణ ఆర్యవైశ్య సంగం మహిళలు అధిక సంఖ్యలో బోనాలు సమర్పించడం జరిగినది. వీరందరికీ శ్రీ బద్ది పోచమ్మ ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు ఈకార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శులు కటకం శ్రీనివాస్, కొమ్మ నటరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్త అనిల్, కోశాధికారి డాక్టర్ వెంకన్న, గౌరవ అధ్యక్షులు తాటికొండ రాంబాబు, ఉపాధ్యక్షులు యాద సంతోష్ మరియు జాయింట్ సెక్రెటరీ పాత శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు పాడి గేదెలు చోరీ...

**శంకరపట్నం:జూన్29(మనవార్త ప్రతినిధి నేరెళ్ల సంతోష్)**
శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో రెండు పాడి గేదెలు చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. మొలంగూర్ గ్రామానికి చెందిన చిరుత ప్రవీణ్ రెండు పాడి గేదెలను గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలం వద్ద కట్టి వేస్తున్నాడు. ఆదివారం వేకువజామున వెళ్లి చూసేసరికి రెండు పాడి గేదెలు కనిపించలేదని ఆందోళన చెంది సమీపంలో వెతికారు. దీంతో కేశవపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. రెండు పాడి గేదెల విలువ సుమారు లక్ష యాభై వేల విలువ ఉంటుందని పేర్కొన్నారు. నెలరోజుల క్రితం ఇదే గ్రామంలో రెండు పాడి గేదెలు చోరీకి గురవడం గమనర్హం.

## నాయనానందకరంగా స్వర్ణగిరి శ్రీనివాసుడి నిత్య కళ్యాణ మహోత్సవం...



**-ఘనంగా స్వర్ణగిరీశునికి తిరువీధి ఉత్సవ సేవ.**

**యాదాద్రి భువనగిరి జిల్లా జూన్ / 29 / మన వార్త జిల్లా ప్రతినిధి**
తెలంగాణ యాదాద్రి తిరుమల స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో ఆదివారం రోజు ఉదయం 10:30 లకు జగదేక చక్రవర్తి అయిన శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి స్వామివారి విశిష్ట కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు దిట్టకవి రవణాచార్యుల దివ్యకరములచే వేదమంత్రాల మంగళ ధ్వనుల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 6:30 లకు స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ ఆలయ నిర్వాహకులు భక్తులు తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. ఈరోజు స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ గోపికృష్ణలు తెలిపారు.

## భవాని ఆర్యవైశ్య వాడకట్టు సంఘం ఆధ్వర్యంలో శ్రీ బద్ది పోచమ్మ తల్లికి బోనాలు సమర్పణ





**వేములవాడ జూన్ 29 ( మన వార్త ప్రతినిధి )**
వేములవాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భవాని ఆర్యవైశ్య వాడకట్టు సంఘం తరపున శ్రీ బద్ది పోచమ్మ తల్లి కి బోనాలు సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా భవాని ఆర్యవైశ్య వాడకట్టు సంఘం అధ్యక్షులు మాడిశెట్టి మహేష్ మాట్లాడుతూ వేములవాడ పట్టణ ఆర్యవైశ్యులు, మరియు ప్రజలందరూ క్షేమంగా, ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతోఉండాలనికోరుకున్నారు. వీరందరికీ శ్రీ బద్ది పోచమ్మ ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. ఈకార్యక్రమంలో భవాని ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి దెబ్బేటి శ్రీనివాస్, కోశాధికారి కముటల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ దొంతుల శ్రీనివాస్, కొమరవెల్లి సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### సుభాష్ నగర్ కాలనీలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన

# ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**తెలంగాణస్టేట్ బ్యూరో, భాస్కర్ చారి, జూన్ 29, మనవార్త.**
మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్ కాలనీలో 30.50 లక్షల వ్యయంతో డ్రైనేజీ పనులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.సుభాష్ నగర్ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే గా ఎన్నికై సందర్భంగా 100 కొబ్బరి కాయలు కొట్టి తన మొక్కులు తీర్చుకున్న బండారి లక్ష్మారెడ్డి.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు సాయిలు, గంగాధర్, తిరుమలయ్య, బలనర్సింహ, పోచయ్య, కృష్ణ, శంకర్, మల్లేష్, ప్రభు, నరేష్, భాను, లలిత, భాగ్య, మీరభాయ్, లక్ష్మీ, స్థానిక నాయకులు తండా వాసుగౌడ్,ఉస్మాన్, అల్లాడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పులివేషాలు వేసేవారు తమ వివరాలను అందజేయండి: ఎస్సై నరేష్



**మల్యాల, జూన్ 29(మన వార్త ప్రతినిధి )**
మొహర్రం వేడుకలలో భాగంగా మల్యాల మండలంలో పులి వేషాధారణ వేసే ప్రజలు తమ వ్యక్తిగత వివరాలను పోలీస్ స్టేషన్లో అందజేయాలని ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు. ఏ రోజు పులి వేషం వేయాలో తెలియపరచడం వలన తగిన భద్రత కల్పించడానికి వెసలు బాటు ఉంటుందని అన్నారు. పోలీసులు ఇచ్చే సూచనలను తప్పక పాటించాలని, లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని ఈ సందర్భంగా ఎస్సై పేర్కొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**జూన్ 29 మన వార్తా ప్రతినిధి**
తలకొండపల్లి మండలం, చీపునుంతల గ్రామంలో వంకూరి నర్సింహా సన్నాఫ్ పెంటయ్య మరణించాడు ఈ విషయం బిఆర్ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ ఉప్పల వెంకటేష్ 3,000 రూపాయలుఅందజేయడం జరిగింది వారి ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.. ఈ కార్యక్రమం లో ఎర్ర నరోత్తమ్ రెడ్డి, ఎర్ర జనార్దన్ రెడ్డి, మండ్ల వెంకటయ్య,బత్తుల బాలకుమార్ గౌడ్,నాయకులు, గుమ్మడి రాజు, బ్రహ్మ చారి, గోసికె గిరి, గోసికె మధు,ఎర్ర ప్రదీప్ రెడ్డి , బందరి రాములు మధూరి శ్రీను, మల్తుంకర్ నగేష్,నిలకంటి శేఖర్,పిరికిరాల కృష్ణ , గుమ్మడి రామకృష్ణ,గొల్ల రాజు,చినుకుంట్ల రాజు,బత్తుల బాలకృష్ణ, గోసికే శ్రీను,, గోసికె మల్లేష్,,పిరికిరాల రవీందర్ ఉదరి కృష్ణయ్య, , ఉదరి పార్వతాలు, , పిరికిరాల శిలారి, వంకూరి శ్రీరాములు.కుమ్మరి యాదయ్య ఈర్లపల్లి జంగయ్య, గోస్కె జంగయ్య, చలిచిమల శ్రీ రాములు తదితరులు పాల్గొన్నారు..

## సత్తు మల్లేష్ అన్నపై అభిమానం చాటుకున్న ఓదెల నరేష్



**వేములవాడ జూన్ 29 ( మన వార్త ప్రతినిధి)**
కరీంనగర్ గ్రంధాలయ చైర్మన్ సత్తు మల్లేష్ అన్నాను కరీంనగర్ ఆర్ బి గెస్ట్ హౌస్ లో మర్యాదపూర్వకంగా కలిసిన వికలాంగుల కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఓదెల నరేష్ మల్లేష్ అన్నకు వేములవాడ రాజన్న స్వామి వారి వస్త్రంతో సన్మానించి లడ్డు ప్రసాదం అందించారు వారు రానున్న రోజుల్లో మంచి పదవిలో ఉండాలని వికలాంగుడు ఓదెల నరేష్ కోరుతున్నారు...

## ప్రశ్నిస్తే మీడియాపై దాడులా తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుడోకూరి ప్రభాకర్ రెడ్డి



**జూన్ 29 మన వార్తా ప్రతినిధి**
**-మహా న్యూస్ పై దాడి పట్ల తీవ్రంగా ఖండన..**
సమాజంలో నాలుగో స్తంభంగా వెలుగొందుతున్న మీడియా ప్రశ్నిస్తే బిఆర్ఎస్ శ్రేణులు దాడులు చేస్తారా?అని తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి" తీవ్రంగా ఖండించారు.తెలుగు న్యూస్ టీవీ ఛానల్ 'మహా న్యూస్' హైదరాబాద్ ప్రధాన కార్యాలయంపై దుండగులు దాడి చేసిన వైనంపై ఆయన ఘాటుగా స్పందించారు. కర్రలు, రాళ్లతో ఆఫీస్ మీద దాడి చేసి బిల్డింగ్ అద్దాలు, కార్ల అద్దాలు పగులగొట్టారనీ టీవీల్లో జరిగిన ఈ హింస ఖండాలు చూస్తే సిగ్గనిపిస్తుందని అన్నారు. కర్రలతో ఆఫీస్ లోకి చొరబడేందుకుప్రయత్నించారనీ దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయనీ ఆయన పేర్కొన్నారు. ప్రజావాణి వినిపించే మీడియాపై దాడి ప్రజాస్వామ్యంపై దాడిగానే పరిగణించాలన్నారు. మహా టీవీపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నాననీ కథనాలు,ప్రసారాల పట్ల అభ్యంతరాలు ఉంటే, తెలియజేయవచ్చునీ వివరణ కోరవచ్చునీ, ఖండన అడగవచ్చునీ ఇటువంటి దాడులు క్షమార్హం కాదు. మహా యాజమాన్యానికి సంఘీభావంతెలుపుతున్నానుడోకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని భవిష్యత్తులో మీడియాపై ఇలాంటి దాడులు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## తుల్జాభవాని మాతా దేవాలయ నిర్మాణానికి ఒక లక్ష విరాళం



**జూన్ 29 మన వార్తా ప్రతినిధిలి**
**-ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు%డ%టాస్క్ సి.ఓ.ఓ. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి..**
కడ్తాల్ మండలంకానుగుబావి తండాలో నూతనంగా నిర్మాణంలో ఉన్న తుల్జాభవాని అమ్మవారి దేవాలయ అభివృద్ధికి రూ. 1,00,000/-(ఒక లక్ష) చెక్ విరాళంగా అందజేసిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఈ సందర్భంగాసుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూదేవాలయాలు ప్రజలలో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు దోహదం చేస్తాయని,దేవాలయాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ సహకారం ఎల్లప్పుడూఉంటుందనితెలుపుతూ,ప్రజలందరిపై తుల్జాభవాని మాతా ఆశీస్సులుఉండాలని,అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరు పాడిపంటలతో,సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానని తెలియజేశారు.ఆలయ కమిటీ సభ్యులుమాట్లాడుతూనూతన దేవాలయ నిర్మాణానికి అడిగిన వెంటనే తన వంతు సహాయంగా ఐక్యత ఫౌండేషన్ ద్వారా రూ. ఒక లక్ష విరాళంగా ఇచ్చి ఆలయ అభివృద్ధికి తన వంతు తోడ్పాటును అందిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ,వారిపై ఎల్లపుడు ఆశీస్సులుఉండాలనికోరుకుంటున్నామనితెలియజేశారు.ఈకార్యక్రమంలోరంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బిక్య నాయక్,ఉప సర్పంచ్ నేనావత్ పాండు నాయక్, కేతావత్ బిచ్యా నాయక్, ఎన్.నర్సింగ్, ఎన్.దేవుల ఫౌండేషన్ సభ్యులు తల్లోజు రఘు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణయ్య స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



**దేవరకద్ర,జూన్29(మన వార్త ప్రతినిధి)**
వనపర్తి జిల్లా మదనాపురం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి హరీష్ రావు అమరచింత లో దివంగత నేత సాయి చంద్ విగ్రహ ఆవిష్కరణ కు వెళుతున్న వారు కారు ఆపి మండల నాయకులను కలిసి పార్టీ గురించి చర్చించారు.రాబోయే స్థానిక ఎన్నికల్లో మండలంలో మంచి విజయంతో సత్తా చాటాలని కోరారు.అనంతరం మండల నాయకులు హరీష్ రావును శాలువతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గుంతలమయంగా మారుతున్న రోడ్లు...



**ఇల్లంతకుంట జూన్ 29 (మన వార్త ప్రతినిధి)టీ**
మానవ హక్కుల పరిరక్షణ కమిటీ ఎన్.హెచ్.ఆర్.సి ఆధ్వర్యం లో ఆదివారం రోజున వంతడుపుల గ్రామానికి అనుసంధానమైన నారెడ్డి పల్లె నుండి ఇల్లంతకుంట వెళ్లే రహదారి,వంతడుపుల నుండి తెనుగువారి పల్లె,వెళ్లి రహదారులను పరిశీలించడం జరిగింది.ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి.గుంతలమయంగా మారడంతో మండల కేంద్రానికి ప్రజలు ఆ రహదారిపై రాకపోకలతో ఇబ్బందులకు గురవుతున్నారు.గత 2 సవంత్సరాల క్రితం ఇట్టి మార్గం లో నడిచిన ఆర్టీసీ బస్ సౌకర్యం నిలిచి పోయింది.గత 20 సంవత్సరాల నుండి ఇలా మట్టి రోడ్డుపై నడుస్తున్న వాహనదారులు వర్షం పడితే మండల కేంద్రానికి వెళ్లడానికి అడుగడుగున గుంతలతో విస్తరణకు నోచుకోక,ఇటు మరమ్మత్తులు లేక,వానాకాలంలో ప్రయాణం నరకప్రాయంగా 20 సంవత్సరాల నుండి ఇలానే కొనసాగిస్తున్న అధికారులు అని ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఏ ప్రభుత్వమైనా పట్టించుకోవడం లేదు ఏదో అధికారులను అడిగితే గుంతలలో మొరం మట్టి పోసి చేతులు గత ప్రభుత్వమన్నా చేయలేదు ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వమైన దీనిపై దృష్టి సారించి ఇట్టి రోడ్లను పునరుద్ధరించి ఆర్టీసీ బస్సులు పునరుదించగలరు అని అన్నారు.అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాలలో కూడా అనంతారం నుండి రహీంఖాన్ పేట వెళ్లే దారి,చింతలకుంట,వెంకట్రావు పల్లె పలు గ్రామాలలో చిన్న వర్షాలకే గుంతలుగా మారుతున్న రోడ్లను త్వరగా మరమ్మతులు చేపించాలని ఒక ప్రకటనలో తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎన్.హెచ్.ఆర్.సి మండల ఛైర్మెన్ కాసుపాక శ్రీనివాస్ మరియు మండల జనరల్ సెక్రటరి పినికాసి మనోహర్ జాయింట్ సెక్రటరీలునారెడ్డి రాజశేఖర్,కాసుపాక బాబులు,సోషల్ మీడియా ఇంచార్జ్ తిప్పారపు బ్రహ్మచారీలు తదితరులు పాల్గొన్నారు.

## మీడియా కార్యాలయం పై దాడిని ఖండిస్తున్నాం..

**- టిడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు సౌడమల్ల యోహాన్, ఏ బూసి సంపత్...**

**జమ్మికుంట, జూన్ 29( మన వార్త ప్రతినిధి):** హైదరాబాద్ కేంద్రంలోని మహా టీవీ న్యూస్ కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నామని హుజురాబాద్ టిడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు యోహాన్, సంపత్ లు అన్నారు. ఈ సందర్భంగా జమ్మికుంట ప్రెస్ క్లబ్





కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారదులుగా ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారం దిశగా జర్నలిస్టులు పనిచేస్తుంటే తమ రాజకీయ ప్రయోజనాల కోసం మీడియా సంస్థల కార్యాలయాలపైన దాడి చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఏ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న వారు చేసే అభివృద్ధి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రజలకు ప్రజాప్రతినిధులకు తెలిసే విధంగా ఎలాంటి జీతభత్యాలు లేకుండా నిస్వార్ధంగా జర్నలిస్టులు పనిచేస్తుంటే ఒక పార్టీకి చెందిన నాయకులు మీడియా సంస్థల పైన దాడి చేయడం మీడియా హక్కులను కాల రాయడమేనని, దాడులకు భయపడేవారు జర్నలిస్టు కాదని జర్నలిస్టుగా పనిచేసే ప్రతి ఒక్కరి లక్ష్యం నిజాలను నిర్భయంగా రాయడమైనవి అన్నారు.ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో పునరావృత్తం అయితే రాష్ట్రవ్యాప్తంగా టీ డబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని అన్నారు.

## ప్రభుత్వ విద్యను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నది



**జమ్మికుంట, జూన్ 29( మన వార్త ప్రతినిధి):**
ప్రభుత్వ ఉపాధ్యాయుల నిర్విరామ కృషి వల్లనే సమాజంలో నైతిక విలువలు పెంపొందుచున్నాయని, నేడు ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాల విద్యారంగాన్ని కాపాడుకునేందుకు విశేష కృషి చేస్తున్నారని,ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో కొత్త విద్యార్థుల సంఖ్య పెరిగినదని విద్యారంగాన్ని నిర్లక్ష్యము చేస్తే సమాజములు అంతరాలు పెరుగుతాయనే భావంతో ప్రభుత్వము కూడా యోచిస్తున్నదని జమ్మికుంట మండల విద్యాధికారి మంథని హేమలత తెలియజేశారు. కావటి స్వరూపరాణి ఉద్యోగ విరమణ సన్మాన సభలో పాల్గొని వారు మాట్లాడినారు. నేడు ఉపాధ్యాయ వృత్తిని కొనసాగించడం కత్తి మీద సాము లాంటిదని ప్రభుత్వ ఉపాధ్యాయుల పైన ఎనలేని భారము పడుచున్నదని, ఉపాధ్యాయులు, సమాజం,ప్రభుత్వ విద్యను కాపాడుకోవలసిన అవసరమున్నదని ఈ సభకు అధ్యక్షత వహించిన మర్రి అవినాష్ టి. పి. టి. ఫ్ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు తెలియజేశారు. టి.పి.టి.ఎఫ్ జమ్మికుంట మండల శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో చెన్నబోయిన బాబయ్య, కొండపాక తిరుపతి, కోడిగూటి తిరుపతి భాషబోయిన ఐలయ్య బినవేన ఐలయ్య మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయ బృందము స్వరూప రాణి మోహన దంపతుల బంధుమిత్రులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి వసూలుపై
# క్రిమినల్ కేసు నమోదు

**–ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి వార్డు ఆఫీసర్ పేరు చెప్పి అందే నరేష్ 20 వేలు వసూలు...**
**–నెడోక ప్రకటనలో వెల్లడించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు...**
**యాదాద్రి భువనగిరి జిల్లా జూన్ / 29 / మన వార్త జిల్లా ప్రతినిధి**



యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక 18 వార్డులో వార్డు ఆఫీసర్ పేరు చెప్పి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులకు గాను అందే నరేష్ 20 వేలు వసూలు చేయడం జరిగిందని అభియోగం వచ్చినందున అట్టి విషయంపై అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేయడం జరిగిందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లు , ప్రభుత్వ సంక్షేమ పథకాల వంటి వాటిని ఇప్పిస్తామని లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లయితే అట్టి వారిపై చట్టపరమైన చర్యలతో పాటు , క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని చెప్పే దళారుల మాట నమ్మవద్దని అలా ఎవరైనా వస్తే తమ దృష్టికి తీసుకొని రావాలని , అట్టి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ పారదర్శకంగా జరుగుతుందని దళారులను నమ్మొద్దని ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునేందుకు ప్రభుత్వం 5 లక్షలు సహాయం అందిస్తుందని , ఎవరైన ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని చెప్పిన వారిని నమ్మోదని కలెక్టర్ తెలిపారు.

## జర్నలిస్టుల సమస్యలపై సమిష్టి పోరు...




**–రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య...**
**–ఘనంగా టీడబ్ల్యూజేఎఫ్ వనపర్తి జిల్లా తృతీయ మహాసభ...**
**వనపర్తి, జూన్ 29(మనవార్త)**
తెలంగాణలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తే రాష్ట్రవ్యాపిత ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు. ఆదివారం వనపర్తిలోని రెడ్డి భవన్ లో టీడబ్ల్యూజేఎఫ్ వనపర్తి జిల్లా తృతీయ మహాసభ ఘనంగా జరిగింది. ఈ మహాసభలో రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు అండగా నిలిచి సమస్యలపై పోరాడే ఏకైక యూనియన్ టీడబ్ల్యూజేఎఫ్ అని అన్నారు. రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడుతున్న యూనియన్ టీడబ్ల్యూజేఎఫ్ మాత్రమే అని అన్నారు. అన్ని జిల్లాల్లో టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ బలపడుతుందని, ఈ నేపథ్యంలో అవగాహన లోపంతో ఫెడరేషన్ పై కొందరు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వానికి ఒక యూనియన్ వంతపాడితే ప్రస్తుత ప్రభుత్వానికి మరో యూనియన్ వంత పాడుతుందని ఎద్దేవా చేశారు. జిల్లాల్లో టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ బలోపేతానికి చేస్తున్న జిల్లా నాయకులను మామిడి సోమయ్య ఈ సందర్భంగా అభినందించారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం మాట్లాడుతూ రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ 20 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అధ్యక్షుడుగా అంబటి స్వామి, ఉపాధ్యక్షులుగా శివన్న యాదవ్, కుమారస్వామి నాయుడు, దేగ శేఖర్, జే.పర్వతాలు, బండి రాజు, కార్యదర్శిగా రామకృష్ణారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా శేఖర్, చెన్నయ్య, బాలరాజు, నాగభూషణం, కోశాధికారిగా పవన్ కుమార్,కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్, శివశంకర్, ముజీబ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటుగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఉస్సేన్, నిరంజన్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడిగా సహదేవ్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికను ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య ప్రకటించారు.

# మన్ కి బాత్ వీక్షణ..



**జమ్మికుంట, జూన్ 29( మన వార్త ప్రతినిధి):**
జమ్మికుంట పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు ఆద్వర్యంలో బిజెపి సీనియర్ నాయకులు బచ్చు శివన్న నివాసంలో భాజపా నాయకులు మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. మోడీ కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగాలకు ప్రోత్సాహకాలు అందించి యువతలో ఉన్న శక్తి సామర్థ్యాలకు నైపుణ్యం అందించి యువ పారిశ్రామిక రంగాన్ని మేడిన్ ఇండియా మేకిన్ ఇండియా ద్వారా దేశంలో సరికొత్త ఇండస్ట్రీ పాలసీ తీసుకువచ్చి స్వదేశీ పరిజ్ఞానంతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని, దేశంలో సింధూర్ పేరుతో చెట్లు నాటే కార్యక్రమాన్ని పార్టీ కార్యకర్తలు తీసుకుని నాటాలని దీనిలో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎర్రబెల్లి సంపత్ రావు, ఆకుల రాజేందర్, జీడి మల్లేష్, శీలం శ్రీను, పట్టణ ఇంచార్జీ దండు కొమురయ్య, బచ్చు శివన్న, అప్పం మధు, కైలాసకొటి గణేష్, పల్లపు రవి, యాంసాని సమ్మయ్య, మోడం రాజు, గట్టు రాకేశ్, అప్పాల రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు వెంటనే నివేషణ స్థలాలు ఇవ్వాలి...

**–మహబూబ్ నగర్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ చేస్తున్న రిలే దీక్షలు...**




**మహబూబ్ నగర్, జూన్ 29( మన వార్త)**
మహబూబ్ నగర్ లో జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ చేస్తున్న రిలే దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపిన రాష్ట్ర, జిల్లా నాయకులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు వెంటనే నివేషణ స్థలాలు ఇవ్వాలి అన్నారు. అదేవిధంగా ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. లేకుంటే రానున్న రోజులలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు తెలుపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జర్నలిస్టు తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో స్థానిక మహిళల ఆధ్వర్యంలో
# గోరింటాకు సంబరాలు



**జమ్మికుంట, జూన్ 29( మన వార్త)**
జమ్మికుంటలో స్థానిక మహిళల ఆధ్వర్యంలో గోరింటాకు సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్థానికంగా మహిళలందరూ ఒక చోటికి చేరి గోరింటాకు పెట్టుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది. పట్టణంలోని యాంసాన్ని సమ్మయ్య పరమేశ్వరి ఇంట్లో స్థానిక వాసవి వనిత క్లబ్ సభ్యులు మరియు మహిళల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో అమ్మవారి పటాన్ని అలంకరించి పారాయణం నిర్వహించారు. అనంతరం మహిళలందరూ కలిసి గోరింటాకు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆషాఢ మాసంలో స్త్రీలు గోరింటాకు పెట్టుకోవడం అనేది ఒక సాంప్రదాయం. దీనికి సౌందర్యపరంగా, ఆరోగ్యపరంగా, ఆధ్యాత్మికంగా ప్రాముఖ్యత ఉంది. ఆషాడంలో వాతావరణంలో మార్పుల కారణంగా శరీరంలో వేడి పెరిగే అవకాశం ఉంది, కాబట్టి గోరింటాకు శరీరంలోని వేడిని తగ్గించడానికి, చల్లదనాన్ని ఇవ్వడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా, ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో, రక్త ప్రసరణను మెరుగపరచడంలో కూడా సహాయపడుతుంది. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, వాసవి వనిత క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



